# నమస్తే తెలంగాణ
## వరంగల్ హనుమకొండ
5 | సోమవారం 25 డిసెంబర్ 2023 | WARANGAL HANUMAKONDA


# హ్యాపీ మెర్రీ క్రిస్మస్..

- నేడు యేసు పుట్టిన రోజు
- విద్యుత్ వెలుగుల్లో కళ కళలాడుతున్న చర్చిలు
- వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు

సమస్త మానవాళిని పాప విముక్తుల చేసి, దైవసన్నిధికి చేర్చేందుకే యేసు ప్రభువు మానవ రూపంలో జన్మించారని చెబుతారు. ఆయన జన్మించిన శుభదినమే క్రిస్మస్. మెర్రీ క్రిస్మస్ అంటే ఆనందం, సంతోషం. అందుకే నేటి పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకొనేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని చర్చిలను అందంగా ముస్తాబు చేయగా రంగురంగుల విద్యుద్దీపాలతో కళ కళ లాడుతున్నాయి. అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభం కాగా ప్రార్థనా మందిరాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్


క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

**స్వేదపత్రం విడుదల సందర్భంగా ఆదివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు తదితర విప్లవాత్మక నిర్ణయాలతో వ్యవసాయాన్ని పండుగ చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి ఇటు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలకు లబ్ధి చేకూర్చి, పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలను వివరించడంతోపాటు ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేసిన పవర్ ప్లాంట్, రూ.1200 కోట్లతో వరంగల్ నగరంలో 2100 పడకలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గురించి ప్రత్యేకంగా చెప్పారు. ఇవే గాక ఉమ్మడి జిల్లాకు అన్నింటా పెద్దపీట వేయగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అన్ని వర్గాల ప్రజలు టీవీల్లో, స్మార్ట్‌ఫోన్లలో ఆసక్తిగా వీక్షించడం కనిపించింది.**

- వరంగల్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)


భూపాలపల్లిలో ఓ షాపులో స్వేదపత్రంపై కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

# స్వేదపత్రంలో మన జిల్లా

## భూపాలపల్లిలో 600 మెగావాట్ల పవర్‌ప్లాంట్‌తో ఉత్పత్తి

### రైతు గోస తీర్చిన కేసీఆర్ సర్కారు



కేసముద్రం: కేసీఆర్ సర్కారు సాగు నీటికి ఢోకా లేకుండా చేసి రైతు గోస తీర్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీరు లేక, కరెంట్ లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడింది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బలోపేతం చేసి నీటి నిల్వ సామర్థ్యం పెంచింది. గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడంతో వేసవిలోనూ చెరువుల్లో మస్తు నీళ్లున్నయ్. దీంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగినయ్. ఎవుసానికి 24 గంటల విద్యుత్ ఇచ్చి, నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఏడాదికి రెండు, మూడు పంటలు పండించిన్రు. సాగు విస్తీర్ణం పెరగడంతో గ్రామాల్లో కూలీలకు పని దొరికింది. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నీటి వసతి పెంచడంతో రైతులు పంటలు మంచిగా పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. రాష్ట్రంలో వర్షపాతం తగ్గినప్పటికీ నీటి సమస్య లేకపోవడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది.

– కూన భద్రాద్రి, రైతు, కల్వల

వరంగల్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్ల కోసం ఉద్యమం జరిగింది. కొత్త రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అది నెరవేరింది. తెలంగాణ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. వరుసగా 60 ఏండ్ల పాటు బతుకుపై, భాషపై దాడి కొనసాగింది. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు పడ్డాయి. అణచివేత నుంచి ఆత్మగౌరవం, సంక్షోభం నుంచి సంమృద్ధి వైపు అడుగులు పడ్డాయి. పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా.. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలుగా ఏర్పడింది. పరిపాలన సౌలభ్యం లక్ష్యంగా కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, పోలీసు డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత పరిపాలన అభివృద్ధి ప్రజలకు దగ్గరగా ఉన్నది. అభివృద్ధిలో కీలకమైన కరెంటు సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగా భూపాలపల్లిలో నిర్మించిన 600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేకంగా ప్లాంట్‌ను 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. నిరంతరం ఉచిత కరెంటుతో పంటలు బాగా పండాయి. రైతు ఆదాయం రెట్టింపయ్యింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. సాగునీటి సరఫరా ప్రక్రియలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. రైతు రుణమాఫీ, రైతు బంధు, వడ్ల కొనుగోళ్లతో రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. రైతు వేదికల నిర్మాణం, నాణ్యమైన విత్తనాల సరఫరా, సబ్సిడీపై ఎరువుల సరఫరాతో రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యారు. సబ్సిడీపై గొర్రెలు, చేప పిల్లల పంపిణీతో ఆయా వర్గాలు ఆర్థికంగా భరోసా సాధించాయి.

- 2110 బెడ్లతో వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం
- కేసీఆర్ పాలనలో కరువు నుంచి సస్యశ్యామలం
- మిషన్ కాకతీయతో ప్రతి చెరువు బాగు
- మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి తాగునీరు
- అభివృద్ధి, సంక్షేమంలో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రస్తావించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- టీవీలు, స్మార్ట్‌ఫోన్లలో ఆసక్తిగా వీక్షించిన ప్రజలు




పాల ఉత్పత్తిలోనూ తెలంగాణ రాష్ట్రం రికార్డులు సృష్టించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ రంగంలో తెలంగాణ రాష్ట్రం కొత్త రికార్డులు సృష్టించింది. ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఎస్సీ సంక్షేమం, ఎస్టీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం, చేనేత సంక్షేమం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం వెచ్చించిన నిధులతో అన్ని వర్గాల్లో సంతృప్తి నెలకొన్నది. దళితబంధు, ఎస్సీ సబ్‌ప్లాన్, అంబేద్కర్ భవనాల నిర్మాణం, గ్రామ పంచాయతీలుగా తండాలు, పోడు భూములకు గిరిజనులకు పట్టాలతో కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమంలో కొత్త రికార్డులు సృష్టించింది. మోడల్ మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలతో గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధించాయి.

మౌలిక వసతులు, సంక్షేమంతో పాటు వైద్య సేవల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణంతోపాటు వరంగల్ నగరంలో 2,110 బెడ్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాన్ని చేపట్టింది. వరంగల్ నగరాన్ని హెల్త్ సిటీగా తీర్చిదిద్దే ప్రక్రియను ముందుకు నడిపించింది. రూ.1200 కోట్లతో ఈ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నది. కేసీఆర్ కిట్, ఆరోగ్యశ్రీ, శిశు మరణాల నియంత్రణ, కంటి వెలుగు పథకాలతో ప్రజా ఆరోగ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలను ఏర్పాటు కేసీఆర్ ప్రభుత్వం దీనికి అనుగుణంగా ప్రతి జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని నిర్మించింది. హనుమకొండ, జనగామ, భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పరిపాలన భవనాల నిర్మాణం పూర్తయ్యింది. ఒక్కో జిల్లాలో రూ.1650 కోట్లతో ఈ భవనాలను నిర్మించింది. అభివృద్ధిలో కీలకమైన రోడ్ల నిర్మాణం, అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రతి జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి డబుల్ లైన్ రోడ్లను, మండల కేంద్రం నుంచి ప్రతి గ్రామానికి రోడ్లను అభివృద్ధి చేసింది. ప్రతి ఊరిలోనూ అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసింది. ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మించింది. గ్రామ పంచాతీయలకు భవనాలను నిర్మించింది. పల్లెలు పచ్చగా ఉండేందుకు అనుగుణంగా ప్రతి ఊరికి ఒక ట్రాక్టర్‌ను సమకూర్చింది. నర్సరీలను ఏర్పాటు చేసింది. మొక్కల పెంపకం, సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది.


మహబూబాబాద్‌లో స్మార్ట్ ఫోన్‌లో చూస్తూ..

# ఇన్‌చార్జి మంత్రిగా పొంగులేటి

## ఉమ్మడి జిల్లాకు శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



వరంగల్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభివృద్ధి నిధుల వినియోగంలో ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో ఆయన సమన్వయం చేస్తారు.


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# కిటకిటలాడిన మేడారం

## భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబర్ 24 : మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. ముందుగా భక్తులు తల నీలాలు సమర్పించి, జంపన్నవాగులో స్నానాలు చేశారు. అనంతరం సమ్మక్క–సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్దరాజును దర్శించుకుని పసుపు, కుంకుమ, సారె, పూలు, పండ్లు సమర్పించుకున్నారు. పిల్లాపాపలు సల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతాల్లో సహపంక్తి భోజనాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. ఎస్‌ఐ ఓంకార్‌యాదవ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



















భయంతో బస్సు దిగిన ప్రయాణికులు

# రన్నింగ్‌లో ఊడిన బస్సు టైర్లు

- భయంతో ప్రయాణికుల ఆర్తనాదాలు
- పలువురికి స్వల్ప గాయాలు
- తృటిలో తప్పిన పెను ప్రమాదం

ఎల్కతుర్తి, డిసెంబర్ 24 : రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్లు ఒక్కసారిగా ఊడిపోవడంతో ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడ్డారు. ఏం జరుగుతుందో తెలియక భయంతో ఆర్తనాదాలు చేశారు. డ్రైవర్ చాకచక్యంగా బ్రేక్ వేయడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ డిపో పల్లెవెలుగు(హైర్ విత్) బస్సు సుమారు 80 మంది ప్రయాణికులతో హుజూరాబాద్ నుంచి హనుమకొండకు బయలుదేరింది. కొంత దూరం వెళ్లాక బస్సు వెనుక భాగం నుంచి శబ్దం వస్తున్నదని ప్రయాణికులు డ్రైవర్‌కు చెప్పారు. దీంతో బస్సును ఆపి డ్రైవర్ టైర్లను పరిశీలించాడు. అనంతరం మెల్లగా వెళ్తుండగా ఎల్కతుర్తి శివారులో వెనుకటైర్లు ఊడిపోయాయి. దీంతో ఒక్కసారిగా బస్సు కుదిపేయడంతో ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడగా స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేయడంతో బస్సు నిలిచిపోయింది. చిన్నపాటి గాయాలతో బయట పడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వారు మరో బస్సులో తమ వెళ్లిపోయారు.

# సెలవు రోజుల్లోనూ జూపార్కు ఓపెన్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 24 : జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య సూచనల మేరకు క్రిస్మస్ సెలవు రోజుల్లో(25 నుంచి జనవరి 1)నూ కాకతీయ జువాలజికల్ పార్కు సందర్శకుల కోసం తెరిచే ఉంచుతామని పార్కు డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజు తెలిపారు. ప్రతి సోమవారం జూపార్కు సెలవు దినం కానీ పండుగ సందర్భంగా ఈ రెండు సోమవారాలు తెరిచి ఉంటుందని చెప్పారు.

# వలస కూలీ ఆగయా

- ఉమ్మడి జిల్లాకు వేలాది మంది రాక
- కూలీల్లో మహిళలు సైతం
- జనవరి 1నుంచి కాకతీయ కాల్వకు నీళ్లు
- ఊపందుకోనున్న వరి నాట్లు


నాట్లు వేస్తున్న కూలీలు

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 24 : ప్రతి పంట సీజన్ మాదిరిగానే ఈసారి కూడా వరి నాట్లు వేసేందుకు పలు రాష్ట్రాల నుంచి వలస కూలీలు వచ్చేశారు. మెట్ట భూముల్లో ఉన్న పంట క్షేత్రాలను రైతులు వరి పొలాలుగా మార్చిన నేపథ్యంలో స్థానికంగా నాట్లు వేసేందుకు కూలీల కొరత భారీగా ఏర్పడింది. దీనికి తోడు నేటితరం యువతులు నాట్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల కూలీల అవసరం తప్పనిసరైంది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిషా రాష్ట్రాల నుంచి మగ కూలీలు వచ్చి రైతులకు కూలీల కొరతను తీరుస్తున్నారు. ఇప్పుడు వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి సైతం ఇతర రాష్ట్రాల కూలీలు తరలివచ్చారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మహిళలు సైతం గతేడాది నుంచి వస్తున్నారు. పెద్ద గ్రామాలకు రెండు మూడు బ్యాచ్‌లు దిగాయి. దాదాపు ప్రతి గ్రామంలో 70శాతానికి పైగా నాట్లన్నీ వలస కూలీలే పూర్తి చేస్తున్నారు.

### చలిని సైతం లెక్క చేయకుండా..

వరి నాట్ల కోసం వచ్చిన వలస కూలీలు చలిని సైతం లెక్క చేయడం లేదు. ఉదయాన్నే పొలాల్లోకి దిగి పనిలో నిమగ్నమవుతున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి కాకతీయ కాలువకు నీళ్లు విడుదల చేయనుండడంతో వరి నాట్లు ఊపందుకోనున్నాయి. దీంతో నిత్యం 12 గంటల పాటు పొలాల్లోనే గడుపుతున్నారు. స్థానిక కూలీల మాదిరిగా కాకుండా రైతులకు వీరితో ఎలాంటి ఇబ్బందులు ఉండడం లేదు. నారు పీకడం మొదలు, నారు పంచడం, అవసరం అనుకుంటే ఎరువులు సైతం చల్లుతూ చకచకా చేసేస్తున్నారు. కేవలం రైతు గట్టు మీద కూర్చుని వీరిని గమనిస్తూ తనకు కావాల్సిన తీరులో నాటు వేయించుకుంటే సరిపోతుంది.

### పొలంలోనే వంటావార్పు..

స్థానికంగా నాట్లు పూర్తి చేసేందుకు వచ్చిన వలస కూలీలు తమకు కావాల్సిన వంటలు సైతం పొలాల వద్దనే తయారు చేసుకుంటున్నారు. వీరిని ఇక్కడకు తీసుకొచ్చిన ఆసామి వీరికి గ్యాస్‌తో పాటు ఇతరత్రా వంట సామగ్రి సమకూర్చుతున్నాడు. దీంతో ఈ కూలీల నుంచి ఒకరిద్దరు కేవలం వంట పనులు చూస్తున్నారు. సమయానికి వంట పూర్తి కాగానే పొలం గట్లపైనే తిండి కానిచ్చేస్తున్నారు. స్థానిక కూలీలు ఎకరాకు పది నుంచి 12మంది నాట్లు వేస్తే వీరు మాత్రం ముగ్గురు, నలుగురే ఎకరా నాటు పూర్తి చేస్తున్నారు. దీనికి తోడు వీరు నాటు వేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుంది. దీంతో రైతులు వీరి వైపు మొగ్గు చూపుతున్నారు. వీరు వరి మొక్కలను వంచి వేయకుండా నిటారుగా వేయడంతో పంట దిగుబడి పెరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో నాట్లు వేసేందుకు సుమారు 30వేల మంది వలస కూలీలు వచ్చినట్లు అంచనా. హనుమకొండ జిల్లాలోనే లక్షా 50వేల 500 ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

### మా దగ్గర ఇప్పుడు నాట్లు లేవు



మాది పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మేం కొంత వరకు వరిని పండిస్తాం అయితే మా దగ్గర ఇప్పుడు వరి నాట్లు లేవు. రెండు మూడు నెలల పాటు మేం ఇక్కడే ఉండి ఇక్కడి రైతుల నాట్లు పూర్తి చేస్తాం. తర్వాత మమ్మల్ని పిలిపించిన ఏజెంటు చెప్పిన మరో చోటికి వెళ్తాం.

– నరేశ్, వలస కూలీ

### ఇక్కడి రైతులు బాగా చూసుకుంటున్నారు



నేను రెండు సంవత్సరాలుగా ఇక్కడికి వరి నాట్లు వేసేందుకు వస్తున్నాను. ఇక్కడి రైతులు మమ్మల్ని మర్యాదగా చాలా బాగా చూసుకుంటున్నారు. మేం నాటు వేసే ఆసాములు మాకు చికెన్‌లాంటి వంటకాలు కాకుండా అభిమానంతో ఇతర అవసరాలు కూడా చూసుకుంటున్నారు.

– గులపి, మహిళా కూలీ